తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
14-05-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 100
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాల్లోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# నగరాన్ని వణికిస్తున్న
# నేపాలీ గ్యాంగ్!

ఖరీదైన ఇళ్లలో పనికి చేరి ప్రాణాలు తీస్తున్న ముఠాలు
అదును చూసి యజమానుల ప్రాణాలు తీస్తున్న వైనం
హైదరాబాద్ మహానగరంలో వరుస దోపిడీలు
రిటైర్డ్ డీఐజీ భార్య హత్యతో వణికిపోతున్న నగరం
ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులే టార్గెట్
తక్కువ జీతానికి వస్తున్నారనే ఆశే యజమానుల పాలిట శాపం
ఇంట్లోని గుట్టు తెలుసుకున్నాకే దోపిడీలకు స్కెచ్
పోలీసులకు వివరాలు ఇవ్వాల్సిందే..

**తెలంగాణ బ్యూరో, (జి ఎస్ ఎస్ రెడ్డి) సిరి న్యూస్:**
హైదరాబాద్ మహానగరం ఇప్పుడు ఒక తెలియని భయం గుప్పిట్లో బతుకుతోంది. విశ్వసనీయమైన పనిమనుషులు అనుకుని ఇంట్లోకి ఆహ్వానిస్తే, వారే యమపాశాలై ప్రాణాలు తీస్తున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా నేపాలీ ముఠాలు నగరంలోని సంపన్న వర్గాలను టార్గెట్ చేస్తూ వరుస దోపిడీలకు, హత్యలకు పాల్పడుతుండటం సంచలనంగా మారింది. వృద్ధాప్యంలో పనిమనిషి సాయం కావాలనుకునే ధనవంతులే ఈ కిరాతకుల ప్రధాన లక్ష్యంగా మారుతున్నారు. ఈ ముఠాలు పక్కా ప్రణాళికతో ఇళ్లలోకి చేరి, అదును చూసి ఘాతుకాలకు పాల్పడుతున్నాయి.

**వరుస దోపిడీలు.. హత్యలు**
నగరంలో ఇటీవల జరిగిన రెండు ప్రధాన నేరాలు నేపాలీ గ్యాంగ్ పనేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నగలు, నగదు కోసం ఒక రిటైర్డ్ పోలీస్

మిగతా 4వ పేజీలో..






## ట్యాపింగ్ కేసులో
# కీలక మలుపు?

- ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో 12 మంది బీఆర్ఎస్ నేతల పేర్లు?
- అగ్రనేత కుటుంబ సభ్యుల పాత్రపై సిట్ ఫోకస్
- 1300 ఫోన్ల ట్యాపింగ్ వివరాల నమోదు
- జడ్జిలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల సమాచార సేకరణపై ఆరోపణలు

**తెలంగాణ బ్యూరో, మే 13 సిరి న్యూస్: :**
తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను అరెస్ట్ చేసి విచారణ జరిపిన సిట్ బృందం ఇప్పుడు రాజకీయ కోణంపై దృష్టి పెట్టినట్టు సమాచారం. ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో 12 మంది బీఆర్ఎస్ నేతల పేర్లు చేర్చే అవకాశ ముందని ప్రచారం జోరుగా

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

- ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్
- సీఎం తో ఉబెర్ సీఈఓ భేటీ

**తెలంగాణ బ్యూరో, మే 13 సిరి న్యూస్: :**
ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా

మిగతా 2వ పేజీలో..



మెగా గ్రోత్ కారిడార్‌తో
## తెలంగాణకు కొత్త దిశ

2



## బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

- విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలి.. టీఆర్ఎస్ చీఫ్ కవిత
- పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై ప్రధాని నోటి వెంట ఒక్క మాట రాలేదు
- సీఎం రేవంత్ రెడ్డి అడగలేదు.. బీఆర్ఎస్ ప్రశ్నించలేదు
- ప్రధాని ఆంధ్రాకు పైసలు ప్రకటించి... మనకు పొదుపు సూత్రాలు చెప్పిండు
- నీళ్ల కోసమే ఏర్పడిన తెలంగాణలో మన వాటాను కూడా వాడుకోలేని దుస్థితిలో ఉన్నాం
- మమ్మల్ని ప్రజలు ఆశీర్వదిస్తారు.. అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తాం

2



## కఠిన చర్యలు తీసుకుంటాం

- డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు
- బక్రీద్ సందర్భంగా పోలీసు అధికారులతో వీసీ

4

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ

4




# 15న విచారణకు హాజరవుతా

- సిట్ అధికారులకు లేఖ పంపిన బండి భగీరథ్
- వ్యక్తిగత కారణాలతో గడువు కోరిన కేంద్రమంత్రి కుమారుడు
- కీలక ఆధారాలతో వస్తానని వెల్లడి
- దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని స్పష్టం

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్: :**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ సిట్ అధికారులకు లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం బషీరాబాద్ పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 15న విచారణకు హాజరవుతానని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా పంపించినట్లు సమాచారం. విచారణకు హాజరయ్యే సమయంలో కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, సాక్ష్యాలను

మిగతా 3వ పేజీలో..



పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

4

## పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల
# గొంతు కోస్తున్నారు

నీట్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వంపై పొంగులేటి ఆగ్రహం
దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని వెల్లడి
బీఆర్ఎస్ హయాంలోనూ ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయని విమర్శ
పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వ్యాఖ్య
ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ



4



## సరస్వతి అంత్య పుష్కరాలకు రండి

- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానించిన దేవాదాయ అధికారులు

**తెలంగాణ బ్యూరో, మే13 సిరి న్యూస్: :**
ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి

మిగతా 4వ పేజీలో..



## బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఆ కేసులో ఎలాంటి జాప్యం లేదు
- బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం
- కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి
- ఎస్ ఐ ఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోంది

4

## 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మాజీ మావోయిస్టు నేత

- ఇంటర్ పరీక్ష రాయనున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ

4

## ట్యాపింగ్ కేసులో కీలక మలుపు?




**మొదటిపేజీ తరువాయి**

సాగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును సీపీ సజ్జనార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు తదితర అధికారులను ఇప్పటికే అరెస్ట్ చేసి విచారణ జరిపిన సిట్.. వారి వాంగ్మూలాల ఆధారంగా కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. అధికారుల విచారణలో బయటపడిన అంశాల ఆధారంగా రాజకీయ నాయకుల పాత్రపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

**అగ్రనేత కుటుంబంపై చర్చ**

ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన అగ్రనేతతో పాటు ఆయన కుటుంబానికి చెందిన ఇద్దరి పేర్లు కూడా ఉండే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరో తొమ్మిది మంది బీఆర్ఎస్ కీలక నేతల పేర్లు కూడా చేర్చనున్నట్టు లీకులు వెలువడుతున్నాయి. అయితే అధికారికంగా మాత్రం సిట్ ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ చేయలేదు.

మొత్తం 1300 ఫోన్లను ట్యాప్ చేసినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించినట్టు సమాచారం. అప్పటి ప్రతిపక్ష నాయకులతో పాటు సొంత పార్టీ నేతలు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లు కూడా నిఘాలో ఉన్నాయన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వ్యక్తిగత సమాచార సేకరణ, రాజకీయ అవసరాల కోసం నిఘా నిర్వహించారన్న కోణంలో సిట్ విచారణ సాగించినట్టు తెలుస్తోంది.

**టెక్నికల్ ఆధారాలే కీలకం**

ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక టెక్నికల్ డేటాను తొలగించినప్పటికీ.. దానిని రికవరీ చేయడంలో దర్యాప్తు బృందం విజయవంతమైందన్న సమాచారం వెలువడుతోంది. కాల్ డేటా, సర్వర్ వివరాలు, నిఘా వ్యవస్థ వినియోగానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలను ఛార్జ్‌షీట్‌లో పొందుపరుస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఆధారాలే కేసులో కీలకంగా మారే అవకాశముందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న సమయంలో ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరగడం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో ఎవరి పేర్లు ఉంటాయి? కేసు కోర్టులో ఎంతవరకు నిలుస్తుంది? అన్న అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.




## హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ


**మొదటిపేజీ తరువాయి**

ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లో నివాసంలోని ఆయన నివాసంలో భేటీ అయింది. ఈ సందర్భంగా దారా ఖోస్రోషాహి..

ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

కాగా, దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు.ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.







# బండి సంజయ్ కుమారుడిపై
# లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

**తెలంగాణ బ్యూరో, మే 13 సిరి న్యూస్: :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై గంభీరమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన ప్రధానితో వేదిక పంచుకోవటం శోచనీయమని అన్నారు. కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు బండి సంజయ్ ఆ మీటింగ్ కు వెళ్లాల్సింది కాదన్నారు. బడాబాబుల పిల్లలు ఏం చేసిన సరే పోలీసులు చర్యలు తీసుకోరన్న అభిప్రాయం ప్రధాని సభతో ప్రజల్లోకి వెళ్లిందన్నారు. నిందితులను దేశం దాటించే అలవాటు బీజేపీకి ఉందని గుర్తు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో అది నిరూపితమైందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటిపోకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

కొందరు ట్వీట్స్ చేస్తూ సమస్యను పరిష్కరించినట్లు బిల్డప్ ఇస్తున్నారని.. అలాంటి పార్టీ వాళ్లు తానెందుకు స్పందించలేదని అడ్డగోలుగా కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఆడపిల్ల విషయం, అందులోనూ మైనర్ విషయంలో స్పందించే ముందు సంయమనం పాటించాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమించినట్లుగా ఆడపిల్లలను క్షమించదని చెప్పారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధిత అమ్మాయి ఫోటోలు బయటకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫోటోలు బయటకు వస్తే వాళ్ల జీవితం నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఫోటోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా ఎకౌంట్లను గుర్తించి వాళ్లను అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాజకీయాల్లోని లేని బండి సంజయ్ కుమారుడి విషయంలో రాజకీయాలను చేయటం తనకు ఇష్టం లేదని బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తన అభిమతమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు మరోసారి మొండి చెయ్యి చూపించారని చేశారు. తెలంగాణ పర్యటనలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇస్తారని భావించిన మనకు పొదుపు సూత్రాలు చెప్పి... ఆంధ్రాకు పైసలు ఇచ్చి వెళ్లిపోయారని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్ట్ జాతీయ హోదా విషయంలో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జాతీయ హోదా గురించి ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని కవిత ప్రశ్నించారు. ప్రధాని పర్యటనలో తెలంగాణకు ఏం ఇవ్వకపోయినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

**తెలంగాణపై మళ్లీ అదే వివక్ష**

తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ మరోసారి రాష్ట్రం పై వివక్ష చూపారని కవిత అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా సహా మహిళ బిల్లు, జనగణనలో కుల గణన గురించి మాట్లాడతారని భావించినప్పటికీ వాటి గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు.పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనిపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అదే విధంగా బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లులకు ఆమోదం తెలుపాలని మరోసారి డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన కాలంతో పాటు సబ్ క్యాస్ట్, ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసుకునేలా వివరాలు పొందుపర్చాలని కేంద్రాన్ని కవిత కోరారు. మహిళ బిల్లులో ఓబీసీ మహిళల సబ్ కోటా ఉండాల్సిందేన్నారు.

**మీ గురువును చూసి నేర్చుకో**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కవిత మండిపడ్డారు. నీళ్ల విషయంలో మనకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా కోసం ప్రధాని మోడీకి లేఖ రాయాలని రేవంత్ ను కోరారు. ఒక వైపు పోలవరం పూర్తి చేసేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే...రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరు ప్రాజెక్ట్ ను ఎందుకు పట్టించుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటి వరకు కూడా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో ఒక్క రివ్యూ కూడా చేయలేదని కవిత విమర్శించారు. మాట్లాడితే నల్లమల్ల బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు రంగారెడ్డి విషయంలో చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న మీ గురువు చంద్రబాబు నాయుడిని చూసైన నేర్చుకో అంటూ రేవంత్ కు సూచించారు. పాలమూరు రంగారెడ్డి లాంటి పరిస్థితే ఉన్న అప్పర్ భద్రకు కూడా జాతీయ హోదా ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కేంద్రం పై ఒత్తిడి పెంచి జాతీయ హోదా వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ కు వచ్చిన సందర్భంలో జాతీయ హోదా గురించి బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

**సాగు యోగ్యమయ్యే ప్రతి గుంట భూమికి నీళ్లిస్తాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల కోసమని కవిత చెప్పారు. కానీ ఇప్పటికి కూడా మనం గోదావరి లో మన వాటాలో పావు శాతం, కృష్ణాలో అరశాతం కూడా వాడుకోవటం లేదని చెప్పారు. ఆంధ్రాలో మాత్రం వాళ్ల వాటాకు మించి నీళ్లు వాడుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. వారితో పోల్చుకుంటే మనం ఎంతో వెనుకబడి ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు కాగా ఇప్పుడు కాంగ్రెస్ కూడా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తుందని కానీ నీళ్లు మాత్రం వాడుకునే సిస్టమ్ చేయలేకపోయారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణ లో సాగు యోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు ఇస్తామని కవిత చెప్పారు. ఇందుకోసం వాటర్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక లష్కర్ ను నియమిస్తామని చెప్పారు. తెలంగాణలో ఉన్న అన్ని నదులపై వందేళ్లు పటిష్టంగా ఉండేలా గేట్లతో కూడిన చెక్ డ్యామ్ లు కడుతామన్నారు.

**జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది**

ఈ నెల 20 నుంచి చేపట్టబోయే జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది అని కవిత అన్నారు. పలు నియోజకవర్గాల్లో జెండా పండుగకు తాను హాజరవుతానని చెప్పారు. జెండా పండుగ నిర్వహణ ఆధారంగా పదవులు ఇస్తామని చెప్పారు. బీసీలకు చట్టసభలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం కొట్లాడుతామని చెప్పారు. అన్ని రాష్ట్రాలు తిరిగి ఈ అంశంపై తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఇక నీట్ పేపర్ లీక్ అయి పరీక్ష రద్దు చేయటంపై కవిత మండిపడ్డారు. రూ. పది డైపర్ కూడా లీక్ కావటం లేదని, అలాంటి నీట్ పేపర్ ఎలా లీక్ అవుతుందని ప్రశ్నించారు. దేశ భవిష్యత్ అయిన విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా కేంద్రం చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఇంత టెక్నాలజీ వచ్చిన తర్వాత కూడా పేపర్ లీక్ కాకుండా చర్యలు తీసుకోలేరా అని ప్రశ్నించారు.

**రైల్వే కోర్టుకు హాజరైన కవిత...**

నాంపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో రైల్ రోకో చేసిన కేసులో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్ లో గల సికింద్రాబాద్ సెకండ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేయడంతో వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ జూలై 17న నిర్వహిస్తామని మేజిస్ట్రేట్ ప్రకటించారు.

బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 2025 నవంబర్ 28న కామారెడ్డిలో టీఆర్ఎస్ నాయకులు రైల్ రోకో చేశారు. ఈ ఆందోళనపై రైల్వే పోలీసులు కల్వకుంట్ల కవితతో పాటు 12 మందిపై కేసు నమోదు చేశారు. మనోరంజన్ రైల్వే కోర్టు విచారణ అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కేసులకు, విచారణలకు భయపడేది లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అవసరమైతే నిరవధిక రైల్ రోకో చేసేందుకు కూడా సిద్ధమని తేల్చిచెప్పారు.

# మెగా గ్రోత్ కారిడార్‌తో తెలంగాణకు కొత్త దిశ

- **వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌కు ఔటర్ రింగ్ రోడ్ల ప్రతిపాదన**
- **ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి అనుసంధానంగా మౌలిక వసతుల రూపకల్పన**
- **ఈవీ వాహనాలు, పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి**
- **టూరిజం, టెంపుల్ కారిడార్ల ఏర్పాటుకు ప్రణాళికలు**
- **వచ్చే 25 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా నగరాభివృద్ధి**



**హైదరాబాద్ సిరి న్యూస్: :**

రాష్ట్ర భవిష్యత్ పట్టణాభివృద్ధికి కీలకంగా భావిస్తున్న మెగా గ్రోత్ కారిడార్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాలను కేంద్రంగా చేసుకుని సమగ్ర మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎయిర్‌పోర్టులను దృష్టిలో ఉంచుకుని రహదారులు, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలు, ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

సమావేశంలో సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. నగరాల విస్తరణను ముందుగానే అంచనా వేసి వచ్చే 25 ఏళ్ల అవసరాలకు సరిపోయేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఏఐ సాంకేతికత వినియోగంపై నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లీజ్‌కు తీసుకునే వాహనాలు సహా ప్రభుత్వ వినియోగంలో ఈవీ వాహనాలే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణాల్లో రేడియేషన్ ప్రభావం తగ్గించేందుకు మల్టీ యుటిలిటీ టవర్లు, స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

టూరిజం, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికీ మెగా కారిడార్ ప్రణాళికలను అనుసంధానించాలని సీఎం పేర్కొన్నారు. నల్గొండ-యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్-నాగోబా-బాసర-కడెం ప్రాంతాలను కలుపుతూ టూరిజం కారిడార్ అభివృద్ధి చేయాలని తెలిపారు. అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధిని కృష్ణా పుష్కరాలకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్తగూడం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను సమగ్ర కారిడార్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలపైనా చర్చ జరిగింది.

వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కారిడార్‌లు భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి కీలకమని సీఎం పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుల రాకతో ఆయా ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయని, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ డిఫెన్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి కానుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన పట్టణాభివృద్ధి విధానంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

## సంపాదకీయం



# రేపటి కోసం...
## నేటి నుంచే మేల్కొందాం!

నేటి కాలంలో మానవాళి సాధిస్తున్న సాంకేతిక పురోగతి, పారిశ్రామికాభివృద్ధి ఎంత వేగంగా సాగుతున్నాయో, అంతే వేగంగా మనం భవిష్యత్తుకు సంబంధించిన సవాళ్లను కూడా కొనితెచ్చుకుంటున్నాం. "రేపటి కోసం" అనే ఆలోచన కేవలం సంపదను దాచుకోవడానికో లేదా వ్యక్తిగత ప్రయోజనాలకో పరిమితం కాకూడదు. రేపటి సమాజం, రేపటి తరం సురక్షితంగా, ఆరోగ్యంగా, శాంతియుతంగా జీవించడమే అసలైన ప్రగతి. ఇందుకోసం వర్తమానంలో మనం తీసుకునే నిర్ణయాలు, వేసే అడుగులే అత్యంత కీలకం. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తూ సాధించే ఏ అభివృద్ధీ శాశ్వతం కాదు. గ్లోబల్ వార్మింగ్, అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు మనకు పర్యావరణ ముప్పును పదే పదే హెచ్చరిస్తున్నాయి. రేపటి తరం స్వచ్ఛమైన గాలిని పీల్చాలన్నా, గుక్కెడు మంచి నీరు తాగాలన్నా నేటి నుంచే ప్లాస్టిక్ రహిత సమాజం వైపు, పునరుత్పాదక ఇంధన వనరుల (సౌర, పవన విద్యుత్) వైపు మనం మరలక తప్పదు. మొక్కలు నాటడం, అడవులను రక్షించడం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలి. కృత్రిమ మేధస్సు (AI), రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికత మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతిక విప్లవంలో మానవీయ విలువలు, నైతికత కనుమరుగవకుండా చూసుకోవాలి. రేపటి తరం కేవలం యంత్రాల మీద ఆధారపడే రోబోలుగా మారకుండా, సృజనాత్మకత, సామాజిక స్పృహ కలిగిన ఉత్తమ పౌరులుగా ఎదగాలి. విద్యా వ్యవస్థలో మార్పులు కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా, నైపుణ్యాల అభివృద్ధితో పాటు సంస్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### ఆరోగ్యమే మహాభాగ్యం

జీవనశైలిలో మార్పులుమారుతున్న ఆహార అలవాట్లు, యాంత్రిక జీవనం వల్ల నేటి యువత అనేక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. రేపటి ఆరోగ్యకరమైన సమాజ స్థాపన కోసం శారీరక శ్రమ, పౌష్టికాహారం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. "రేపటి కోసం" మనమంతా ఒక సుస్థిరమైన, సమానత్వంతో కూడిన బ్లూప్రింట్‌ను సిద్ధం చేసుకోవాలి. రాజకీయ రంగుల కంటే సామాజిక శ్రేయస్సుకు, స్వార్థం కంటే సమాజ హితానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే భావితరాలకు మనం ఒక సురక్షితమైన ప్రపంచాన్ని అందించగలం. నేటి చిన్న పొరపాటు రేపటి పెద్ద శాపంగా మారకముందే, మన ఆలోచనల్లో, ఆచరణలో మార్పు తీసుకురావడమే మన ముందున్న ఏకైక మార్గం.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో తూప్రాన్ టోల్ గేట్ చెక్ పోస్టును





**• తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

**తూప్రాన్ మే 13 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని టోల్గేట్ వద్ద రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బుధవారం అప్రమత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆయన స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పని సరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే చెక్ పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పని సరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. అదేవిధంగా తూప్రాన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి తూప్రాన్ పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ సిఐ వెంకట్ రాజు గౌడ్ సీఐ సందీప్ రెడ్డి తూప్రాన్ ఎస్ఐ గంగరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలన..

**జిల్లా అదనపు కలెక్టర్ సంగీత..**

**హత్నూర, మే 13,(సిరి న్యూస్)**



హత్నూర మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సంగీత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల దేవులపల్లి, చందాపూర్ వద్ద ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూకం, రవాణా, చెల్లింపుల విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు తెచ్చిన ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ధాన్యం భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు.రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బిల్లులను త్వరగా పూర్తి చేసి, రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు త్వరితగతిన జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం మండలంలోని రైస్ మిల్లులు రాయల్ బిన్నీ కాసాల, మహాలక్ష్మి బోర పట్ల, ఆదిత్య సిరిపురం పరిశీలించిన అదనపు కలెక్టర్ సంగీత, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యంపై ఎలాంటి అక్రమ కోతలు విధించరాదని మిల్లు యాజమాన్యాలకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి రవాణా చేసిన లారీలు, డీసీఎంలను ఎక్కువసేపు నిల్వ ఉంచకుండా వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు.ఈ తనిఖీల్లో తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో, డీ ఎం సి ఎస్, డీ టీ సి ఎస్ సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి

**వెల్దండ మే 13 (సిరి న్యూస్)**

పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు వెల్దండ మండల పరిధిలోని రాఘాయి పల్లి గ్రామానికి మల్లేష్ గోలీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుండి 14,000 వేల రూపాయలు మంజూరయ్యాయి చెక్కును బాధితునికి గోలి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తుందన్నారు. అనారోగ్యాలకు గురైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ తో ఉపశమనం కలుగుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో గానో తోడ్పాటునందిస్తుందని గోలీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ చైర్మన్ ను సన్మానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.

**కల్వకుర్తి, మే 13 (సిరి న్యూస్)**

కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని మాడుగుల మండలం మాజీ ఎంపీపీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూదిని రామ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ట్రిగునల్ చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్ లో ఆయన కార్యాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాతొ సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూదిని పద్మారెడ్డి మనోహర్ రెడ్డి మండల ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి

**అడ్లూరిజగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 13, (సిరి న్యూస్)**

గొల్లపల్లి మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన లారీ ప్రమాద ఘటనపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. ప్రమాదంలో రైతులు గాయపడటంతో పాటు అక్కడ నిలిపి ఉంచిన మోటార్ సైకిళ్లు దెబ్బతిన్న విషయం తెలుసుకున్న మంత్రి కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా సందర్శించి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను పరిశీలించిన మంత్రి, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# దేశాభివృద్ధికి , భవిష్యత్తులో ప్రణాళికల రూపకల్పనకు జనగణన ఒక కీలకం

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్**

**(సిరి న్యూస్) కుత్బుల్లాపూర్ :**



దేశాభివృద్ధికి , భవిష్యత్తులో ప్రణాళికల రూపకల్పనకు జనగణన ఒక కీలకమైన పునాది అని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ అన్నారు. బుధవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ వార్డులో పర్యటించి, జనగణన-2027 మొదటి దశలో భాగంగా జరుగుతున్న గృహ గణన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేటర్లు , సూపర్‌వైజర్లతో ముఖాముఖి మాట్లాడి, వివరాల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈసారి జనగణన ప్రక్రియ డిజిటల్ పద్ధతిలో జరుగుతున్నందున, మొబైల్ యాప్‌లో ప్రతి ఇంటి నంబరు, కుటుంబ సభ్యుల ప్రాథమిక సమాచారం , గృహ వసతుల వివరాలను ఎక్కడా తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల ప్రశ్నల పై ఎన్యూమరేటర్లకు పూర్తి అవగాహన ఉండాలని, ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆన్‌లైన్‌లో తమ వివరాలను తామే నమోదు చేసుకున్న (సెల్ఫ్ ఎన్యూమరేషన్) కుటుంబాల డేటాను సిస్టమ్‌లో ధృవీకరించుకోవాలని, సర్వేను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే సూపర్‌వైజర్లు తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువులోగా వంద శాతం గణన పూర్తి చేయాలని ఆయన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో చార్జి సెన్సస్ ఆఫీసర్ , ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్, అడిషనల్ చార్జి సెన్సస్ ఆఫీసర్ , ఏ. ఎం. సి. ప్రమీల, డిప్యూటి ఈఈ (ఎస్డబ్ల్యుఎం) నిఖిల్ రెడ్డి , సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం పాలసీలకి విరుద్ధంగా ఉన్న మద్యం షాపులను వెంటనే తొలగించాలి

**(సిరి న్యూస్)కుత్బుల్లాపూర్ :**

మద్యం పాలసీలకి విరుద్ధంగా ఉన్న మద్యం షాపులను వెంటనే తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పోలీసు సీఐకీ వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం పాలసీ ప్రకారం మెయిన్ రోడ్డులు, జాతీయ రహదారులో, గుడులు, పాఠశాలలకు కనీసం వంద మీటర్ల దూరంలో మద్యం విక్రయించాలి అని గుర్తు చేశారు. రహదారులో మద్యం పాలసీకి వ్యతిరేకంగా మెయిన్ రోడ్డుపై ఏదేచ్ఛగా మద్యం విక్రయలు కొనసాగుతున్నాయి అని అన్నారు. ముఖ్యంగా వి- లిక్కర్, చివాస్ వైన్ షాప్, స్పిరిట్ వైన్ షాప్, ఎస్వీడీ లిక్కర్ షాప్ తదితర మద్యం షాప్లు ఎక్సైజ్ పాలసీ, గండిమైసమ్మ చౌరస్తా నుండి మియాపూర్ వరకు మెయిన్ రోడ్డు పై నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నారు అని వారు అన్నారు. రీసెంట్గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద రహదారి పై వెళ్తున్న ఒక షిఫ్ట్ కారు సడన్ గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద ఆగడం వల్ల వెనక నుండి వస్తున్న వాటర్ ట్యాంక్ కారును బలంగా గుద్దడం వల్ల కారు వెనక భాగం డ్యామేజ్ అయింది. అలాంటి అనేక సంఘటనలు రహదారుల పై జరగడం సర్వ సధారణం అవుతున్నాయి. అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్, ఇంద్రన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, సాయి నగర్, ఎన్టీఆర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఇందిరమ్మ కాలనీ, తదితర ప్రాంతాలలోని మద్యం బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

# 15న విచారణకు హాజరవుతా

**మొదటిపేజీ తరువాయి**

సమర్పిస్తానని భగీరథ్ వెల్లడించారు. దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సిట్ అధికారుల దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని బండి భగీరథ్ స్పష్టం చేశారు. కేసు విచారణలో పారదర్శకంగా వ్యవహరిస్తానని లేఖలో పేర్కొన్నారు.

# పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

**హైదరాబాద్, మే 13 సిరి న్యూస్: :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై పోక్సో కేసు నమోదు అయిన విషయం విదితమే. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసు జారీ చేశారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్ పోలీసుల విచారణకు హాజరు కాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (త్రి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ గురువారం విచారణ జరపనుంది.

**భగీరథ్ అబ్‌స్కాండింగ్..**

**నగరంలో పలుచోట్ల పోస్టర్లు**

పోక్సో కేసు నమోదైన భగీరథ్‌పై అబ్‌స్కాండింగ్ అంటూ నగరంలో పలుచోట్ల పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని ఉంది. కొన్నిరోజులుగా భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల
# గొంతు కోస్తున్నారు

**ఖమ్మం సిరి న్యూస్: :**

"డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా?" అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన నీట్ పరీక్ష పత్రాల లీకేజీ అంశంపై మాట్లాడారు.

పరీక్షకు 42 గంటల ముందే నీట్ ప్రశ్నపత్రాలు బయటకు రావడం దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ కుంభకోణంతో దేశవ్యాప్తంగా 23 లక్షల మంది, తెలంగాణలో 70 వేల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వ్యవహారంపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ గ్రూప్1 నుంచి గ్రూప్4 వరకు పలు పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వానికి చెందిన వ్యక్తులే ప్రశ్నపత్రాల విక్రయంలో భాగమయ్యారని ఆరోపించారు. ఇంటర్ ఫలితాల తారుమారుతో 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామక సంస్థలను ప్రక్షాళన చేసి పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో జీళ్లచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల ప్రజల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా
# మాజీ మావోయిస్టు నేత

- **ఇంటర్ పరీక్ష రాయనున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ**
- **ఇంటర్ పూర్తి కోసం సప్లిమెంటరీ పరీక్షకు హాజరు**
- **లా చదవాలనే లక్ష్యంతో మళ్లీ పుస్తకాలు పట్టిన మాజీ నేత**
- **ఒక్క తెలుగు పరీక్ష మిగిలిపోవడంతో ప్రత్యేక అనుమతి**
- **గతేడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ**
- **అజ్ఞాతం నుంచి సాధారణ జీవితంలోకి అడుగులు**

**కోరుట్ల, మే 13 సిరి న్యూస్: :**

మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నలభై రెండేళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్ పరీక్ష రాయడానికి సిద్ధమవుతున్నారు. కోరుట్లలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న ఆయన, ఒకప్పుడు మధ్యలో ఆగిపోయిన విద్యను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. లా కోర్సులో చేరాలనే లక్ష్యంతో ఇంటర్ పూర్తి చేయాల్సి రావడంతో ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు.

తిప్పిరి తిరుపతి కోరుట్లలో ఇంటర్ చదువుతున్న సమయంలోనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పట్లో నమోదైన కేసులు, పోలీసు పరిస్థితుల కారణంగా తెలుగు పరీక్షకు హాజరుకాలేకపోయారు. మిగతా అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినప్పటికీ, ఒకే ఒక్క తెలుగు పరీక్ష మిగిలిపోయింది. ప్రస్తుతం ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు అవకాశం లభించింది.

గతేడాది నవంబర్‌లో తిప్పిరి తిరుపతి ముగ్గురు సహచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయన లొంగుబాటును అప్పటి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. మావోయిస్టు కార్యకలాపాల నుంచి బయటకు వచ్చి సాధారణ జీవితం వైపు అడుగులు వేయడం శాంతి ప్రక్రియకు సానుకూల సంకేతమని అప్పట్లో ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించిన దేవ్‌జీ, బసవరాజు మరణం తర్వాత సంస్థలో అగ్రస్థాన నాయకత్వంలో ఉన్న వ్యక్తిగా భావించబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో ఆయన లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు విద్యను కొనసాగిస్తూ న్యాయవాద వృత్తి వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకోవడం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది.



# నగరాన్ని వణికిస్తున్న నేపాలీ గ్యాంగ్!

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నతాధికారి భార్యను అతి దారుణంగా హత్య చేసి నేపాలీ ముఠా పరారవ్వగా, నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మరో ఘటనలో సోమవారం నాడు ఒక వృద్ధ దంపతులను ఇంట్లోనే కట్టేసి, బీభత్సం సృష్టించి, ఉన్నదంతా దోచుకుని పారిపోయారు. ఈ వరుస ఘటనలు నేపాలీ పనిమనుషుల పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళనను, భయాన్ని కలిగిస్తున్నాయి.

**తక్కువ జీతమే శాపమా..?**

హైదరాబాద్‌లో ప్రస్తుతం పనిమనుషుల కొరత విపరీతంగా ఉండటం నేరగాళ్లకు వరంగా మారింది. ఇదే అదనుగా నేపాలీలు తక్కువ జీతానికే వాచ్‌మెన్లుగా, వంట మనుషులుగా చేరుతున్నారు. యజమానులు కూడా తక్కువ ఖర్చుతో పని అయిపోతుందని ఆశపడి, వారి వివరాలు సరిగా సేకరించకుండానే ఇంట్లోకి చేర్చుకుంటున్నారు. గత రెండేళ్లలో నగరంలో నేపాలీల సంఖ్య విపరీతంగా పెరగడం, వారిపై సరైన నిఘా లేకపోవడం ఈ నేరాలకు ప్రధాన కారణమవుతోంది. స్థానిక కూలీల కంటే తక్కువ జీతానికే దొరుకుతుండటంతో వీరికి డిమాండ్ పెరిగింది, కానీ అదే ఇప్పుడు యజమానుల ప్రాణాల మీదకు తెస్తోంది.

**రెక్కీ నిర్వహించి మరీ దోపిడీ**

దోపిడీ లక్ష్యంగా వచ్చే నేపాలీలు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వీరు నేరుగా దొంగతనానికి రాకుండా, మొదట కూలీలుగా లేదా పనిమనుషులుగా నిశ్శబ్దంగా ఇళ్లలోకి ప్రవేశిస్తారు. ఇంట్లో ఎవరెవరు ఉంటారు? నగదు, నగలు ఎక్కడ భద్రపరుస్తారు? సీసీ కెమెరాలు ఎక్కడ ఉన్నాయి? వంటి అంశాలపై పూర్తిగా 'రెక్కీ' నిర్వహిస్తారు. ముఖ్యంగా పిల్లలు విదేశాల్లో ఉండి, ఇంట్లో ఒంటరిగా ఉండే వృద్ధ దంపతులనే వీరు ప్రధానంగా పసిగడతారు. ఒకరు పనిలో చేరి లోగుట్టు తెలుసుకున్న తర్వాత, మిగిలిన ముఠా సభ్యులను పిలిపించి పక్కా స్కెచ్‌తో దోపిడీలకు పాల్పడుతున్నారు.

**నిఘా లేని వలసలు**

నగరంలో కేవలం నేపాలీలే కాకుండా బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల వారు కూడా అక్రమంగా చేరుతూ ఉపాధి పొందుతున్నారు. తక్కువ జీతం ఇస్తున్నామన్న నెపంతో యజమానులు వీరి వివరాలను పోలీసులకు తెలపకుండా గోప్యంగా ఉంచుతున్నారు. ఎప్పుడైతే ఇలాంటి హత్యలు లేదా దోపిడీలు జరుగుతాయో, అప్పుడు మాత్రమే అధికారులు విచారణ చేపడుతున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే పరిస్థితి మళ్లీ మామూలుగా మారిపోతోంది. విదేశీయులు లేదా పొరుగు దేశాల నుంచి వచ్చే వలసదారులపై నిరంతర నిఘా లేకపోవడం నేరగాళ్లకు పెద్ద వెసులుబాటుగా మారింది.

**వర్కర్ అగ్రిమెంట్ తప్పనిసరి**

నగరంలో నివసించే వారు తమ భద్రత కోసం కొన్ని నియమాలను కచ్చితంగా పాటించాలని పోలీస్ శాఖ పదేపదే హెచ్చరిస్తోంది. అద్దెకు ఉండేవారి కోసం రెంటల్ అగ్రిమెంట్ ఎలాగైతే చేస్తారో, అలాగే పని మనుషుల వివరాలు పోలీసులకు ఇచ్చేలా 'వర్కర్ అగ్రిమెంట్' ఉండాలి. తమ వద్ద పనిచేసే వారి వివరాలను, ఫొటోలను, ఆధార్ కార్డులను సమీప పోలీసు స్టేషన్‌లో సమర్పించి వెరిఫికేషన్ చేయించుకోవాలి. పనిమనిషిని పెట్టుకునే ముందే వారి నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం వల్ల ఇటువంటి ముప్పుల నుండి తప్పించుకోవచ్చు.

**అప్రమత్తతే రక్షణ**

ప్రస్తుతం హైదరాబాద్ వ్యాప్తంగా వేలాదిగా నేపాలీలు విస్తరించి ఉన్నారు. వీరిలో నిజాయితీగా కష్టపడే వారెవరో, దోపిడీ లక్ష్యంతో వచ్చిన నేరగాళ్లెవరో గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. యజమానులు కేవలం తక్కువ జీతానికి వస్తున్నారని ఆశపడి అపరిచితులను ఇంట్లోకి చేర్చుకోవడం వల్ల నిలువునా మునిగిపోయే ప్రమాదం ఉంది. అప్రమత్తతే రక్షణ అని, ప్రతి యజమాని తమ పనిమనుషుల వివరాలను పోలీసులకు తెలిపి నిఘా ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# కఠిన చర్యలు తీసుకుంటాం

- **డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు**
- **బక్రీద్ సందర్భంగా పోలీసు అధికారులతో వీసీ**



**హైదరాబాద్, మే 13 సిరి న్యూస్: :**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రెటరీ కె.ఇలంబరి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బక్రీద్.. ఇతర పండగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్‌పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండగ ముగిసే వరకు తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు సస్పెక్ట్ షీట్లు కూడా తెరుస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండు వర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు బక్రీద్ పండగ అప్రమత్తతో ఉన్నారని తెలిరు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్టు యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇలంబర్తి మాట్లాడుతూ పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు పలు సూచనలు చేశారు.

# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

**మహబూబాబాద్, మే 13:**

భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు.ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ 'మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు రండి

**మొదటిపేజీ తరువాయి**

కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం అందింది. బుధవారం దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు..ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ అధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం,రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



# బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **ఆ కేసులో ఎలాంటి జాప్యం లేదు**
- **చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవు**
- **బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం**
- **కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి**
- **ఎస్ ఐ ఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోంది**

**తెలంగాణ బ్యూరో, మే13 సిరి న్యూస్: :**

మైనర్ బాలికపై లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటోన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు ఏ మాత్రం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని చెప్పారు. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులు తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాము నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎస్ ఐ ఆర్ తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.



# వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**పాపన్నపేట్ మే 13 (సిరి న్యూస్):**

మండలంలోని కుర్తివాడ గ్రామంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్ఓ డి ఎం సి ఎస్ ఓ గారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకోవాలని , ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద, నిర్వాహకులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు




**మునిపల్లి, మే 13 (సిరి న్యూస్):**

మునిపల్లి మండల లింగంపల్లి గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రజినీ, డాక్టర్ కరుణాకర్ పాల్గొని పంటలలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరిరక్షణలో పచ్చిరొట్టే సాగు పాత్ర, పంటల మార్పిడి ద్వారా దిగుబడుల పెంపు, పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎరువుల సమర్థ వినియోగంపై రైతులకు వివరించారు.మట్టిపరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే డ్రోన్ స్ప్రేయర్ల వినియోగం, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు తమ సందేహాలను శాస్త్ర వేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ నిఖిత, ఉపసర్పంచ్ రాజనరసింహ, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

విద్యుత్ నగర్ లో ఆధ్యాత్మిక వాతావరణం

లచ్చిరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఘన నిర్వహణ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి




**రామచంద్రపురం, మే 13 (సిరి న్యూస్):**

తెల్లాపూర్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ లచ్చిరామ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరై శ్రీ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబ్జీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, సంపత్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు





- **గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా***
- **వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సి.వి ఆనంద్ ఆదేశాలు**

**మెదక్ మే,13(సిరిన్యూస్)**

బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.గోవుల అక్రమ రవాణా, గోవధ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. పశువుల రవాణాకు సంబంధించి ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర సరిహద్దులు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, పశువుల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో 24 గంటల నిఘా కొనసాగించాలని సూచించారు. అలాగే గోవుల రవాణా పేరుతో కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు చేసినా ఉపేక్షించబోమన్నారు.చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి పోస్టులు పెట్టే వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డియస్పిలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఆర్డిఓ జయచంద్ర రెడ్డి, సీఐలు సందీప్ రెడ్డి, జాన్ రెడ్డి,మహేష్, రేణుక, రాజశేఖర్ రెడ్డి, కృష్ణ మూర్తి, సైదా నాయక్, ఎసై గంగా రాజు, వెటర్నరీ డిపార్ట్మెంట్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా విద్యా పరిరక్షణ

- **జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎ.కృష్ణారెడ్డి**
- **జోగిపేటలో విద్యావారోత్సవాలు**

**జోగిపేట, మే13, సిరి న్యూస్‌:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా పరిరక్షణకై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణపై గ్రామ ప్రథమ పౌరులైన గ్రామ సర్పంచ్ లకు అవగాహన కార్యక్రమమును నిర్వహించడం శుభప్రదమని జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు.విద్యా వారోత్సవాల్లో భాగంగా బుధవారం అందోలు నియోజక వర్గ స్థాయి మున్సిపల్ ప్రతినిధులు,సర్పంచ్ లకు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, విద్యార్థుల నమోదుపై అవగాహన సదస్సును స్థానిక జోగిపేట బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాభోధన జరుగుతుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని అన్నారు. జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఎ.చిట్టిబాబు మాట్లాడుతూ స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ జోగిపేటను విద్య, వైద్య పరంగా చక్కగా నియోజక వర్గాన్ని తీర్చిదిద్దుతున్నారని, మన వంతు ప్రయత్నంగా మన గ్రామాల్లో ఉన్న పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. పీఆర్‌టీయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎ మాణయ్య మాట్లాడుతూ పాఠశాలల పరిరక్షణ బాధ్యత మనందరిదని ప్రతి పాఠశాలలో అంకితభావంతో పనిచేయగల,సుశిక్షితులైనకుశలైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో. విద్యార్థుల సంఖ్య అనుకున్న స్థాయిలో లెకపోవడం భవిష్యత్ లో ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ఇబ్బందికరంగా




అగుపిస్తుందన్నారు. మండల విద్యాధికారి బి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుండి మన నియోజక వర్గం లోని పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించాబోతుందని తెలిపారు.విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండల విద్యాధికారులు బండి కృష్ణ (అందోలు), శంకర్ (పుల్కల్), నర్సింలు (రాయికోడ్), బీమ్ సింగ్(మునిపల్లి) రిసోర్స్ పర్సన్స్ గా బి. రాజమల్లు,శ్రీశైలం,గణేష్,లక్ష్మి నారాయణ అవగాహన కార్యక్రమమును నిర్వహిం చారు. .కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ నరేష్ కుమార్, నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు హాజరైనారు.

# పోక్సో బాధితులకు 'భరోసా'

- **భరోసా సెంటర్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

**మెదక్ మే,13(సిరిన్యూస్)**




లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించారు.కార్యాలయ రికార్డులు,సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించి పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసులో సకాలంలో న్యాయ, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోక్సో చట్టాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.వేధింపులు, అత్యాచారాలు, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలులో ఉన్నాయని,




లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, టీజీఐఐసీ చైర్మన్

**సదాశివపేట. మే 13. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని టీజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలోని 6,7,8 వార్డులలో టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూ.13 కోట్ల అంచనా వ్యాయంతో బీటీ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థ, ఇండోర్ స్టేడియం, రోడ్డు విస్తరణ పనులకు టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ నిధులతో పట్టణంలోని ప్రధాన రహదారుల సమస్యలు తొలగిపోతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని సదాశివపేట పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని అన్నారు. గతంలో మంజూరైన పనులను కొంత మార్పులతో అమలు చేస్తున్నారని తెలిపారు. పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ శివాజీ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్ లు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు,కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు పెద్దపీట

- ఆర్థిక ఎదుగుదలకు వృత్తి శిక్షణలే మార్గం
- ఎంపీ సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ
- స్వయం ఉపాధిపై అవగాహన.

**నారాయణఖేడ్, మే 13 (సిరి న్యూస్):**

మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “మిషన్ శక్తి – బేటీ బచావో బేటీ పడావో” కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ మరియు హెల్ప్‌లైన్ నంబర్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ మహిళా సాధికారత కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవనోపాధి అభివృద్ధికి మరియు వారు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. శాసన సభ్యులు పట్లోళ్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ కేంద్రాలు మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్ షెట్కార్ మాట్లాడుతూ మహిళల సాధికారత, బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ, “తెలంగాణ రైజింగ్ – 99 డేస్ యాక్షన్ ప్లాన్” ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ సుజాత, జిల్లా సమన్వయ కర్త పల్లవి, సూపర్వైజర్లు సుజాత, మంజుల, సఖి సిబ్బంది మరియు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.



# పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి
- పరిరక్షణే ధ్యేయం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్
- జిల్లావ్యాప్తంగా 9 చెక్‌పోస్టుల ఏర్పాటు

**సంగారెడ్డి, మే 13 (సిరి న్యూస్):**




బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా నివారణ మరియు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడటంపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ ఇతర శాఖలతో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా నివారణకు జిల్లాలో 9 చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, సిబ్బంది 24/7 అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, వ్యర్థాలను నిర్ణీత ప్రదేశాల్లోని గుంతల్లో మాత్రమే వేసి పరిశుభ్రతకు భంగం కలగకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం తెలంగాణకు రాకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతుల ప్రయోజనాలను కాపాడాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

# అత్యాచార నిందితుడికి 20 ఏళ్లు జైలు!

- సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు
- దర్యాప్తు అధికారుల అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, మే 13 (సిరి న్యూస్):**

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి సంగారెడ్డి ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం చారిత్రాత్మక తీర్పునిచ్చారు. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన ఈ కేసులో, రాజంపేటకు చెందిన ఎరిగడిన్ల వద్దె యాదగిరి (34) అనే వ్యక్తిని ఐపీసీ సెక్షన్లు 448, 323, 376–ఏబీ, పోక్సో చట్టం కింద దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం, 20 ఏళ్ల శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధించింది, జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించింది. ఈ కేసులో శాస్త్రీయ సాక్ష్యాధారాలను సేకరించి, కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రత్యేక పీపీ బి. సూర్ రెడ్డి, భరోసా లీగల్ కౌన్సిలర్ ఎస్. అపర్ణ, అప్పటి దర్యాప్తు అధికారి డిఎస్పీ బి. రవీంద్ర రెడ్డి, ప్రస్తుత టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. రామనాయుడు మరియు కోర్టు లైజనింగ్ అధికారులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేకంగా అభినందించారు. నేరగాళ్లకు ఇటువంటి శిక్షలు పడటం వల్ల సమాజంలో భయం ఏర్పడి, మహిళలు మరియు బాలికలపై అకృత్యాలు తగ్గుతాయని ఈ సందర్భంగా ఎస్పీ అభిప్రాయపడ్డారు.

# వేసవి దృశ్య మందులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్
- ధర్మారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**రామాయంపేట, మే 13 (సిరి న్యూస్)**





వేసవి సీజన్ కాలంలో తీవ్ర వడ గాలుల నేపథ్యంలో సెలైన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని మెదక్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ వైద్యులకు సూచించారు. బుధవారం ఆయన రామాయంపేట మండల పరిధిలోని డి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టికలను నిశితంగా పరిశీలించి విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా వడగాలుల తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సమర్థవంతమైన ద్రవ నిర్వహణతో పాటు అన్ని విభాగాల్లో తగినంత ఓఆర్ఎస్ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వేసవి కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మందుల దుకాణం, ఐఆర్ఎల్ విభాగం, వ్యాక్సిన్ నిల్వ కేంద్రాలను తనిఖీ చేసి నిల్వలపై ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రచారానికి సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన ప్రత్యేక సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి

## డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు

**వెల్దుర్తి, మే13 (సిరి న్యూస్):**





వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రం లోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సుభాష్, సీసీ సుల్తానా, నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం ఐకెపి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మహిళ అభివృద్ధికి తోడ్పాటుగా వారికి రుణాలు మంజూరు చేయించి వారి తోడ్పాటుకు సహకరించాలని, అలాగే మండలంలో ఉన్న బకాయిలను వసూలు చేసి మరల వాళ్లకు ఋణలు ఇప్పించాలని మహిళా శక్తి సంబంధించిన అన్ని విషయాలపై చర్చించి అధికారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి, డిపిఎం బాలరాజ్, ఆర్ఎం గంగారం, ఏపీఎం సుభాష్, సీసీలు, వి ఏ ఓ లు, తదితరులు పాల్గొన్నారు.




# కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన ..



**రామాయంపేట, మే 13 (సిరి న్యూస్)**

విద్యా వారోత్సవాల్లో భాగంగా రామాయంపేట మండల పరిధిలోని కోమటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శ్రీకారం చుట్టారు. సుమారు 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, స్పెషల్ ఆఫీసర్ అనురాధ, ఏఈ అరవింద్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కు ప్రవీణ్ కుమార్ , దేవుని రంజిత్, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, నాయకులు రమేష్ రెడ్డి,చింతల యాదగిరి, కుంభంపాటి విప్లవ కుమార్,కాంగ్రెస్ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక రుణాలు ఇవ్వాలి

## మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్



**గుమ్మడిదల, మే 13( సిరి న్యూస్):**

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేపల పెంపకం సంక్షేమ పథకం ద్వారా ప్రభుత్వం ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ కోరారు. బుధవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో గుమ్మడిదల మత్స్యకారుల సహకార సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసి మత్స్యకారుల జీవనోపాధికి తోడ్పడిన ఘనత మాజీ ముఖ్యమంత్రికే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ నిధులు కేటాయించి, తక్కువ వడ్డీతో రుణాలు అందించి వారికి అండగా నిలవాలని కోరారు. అనంతరం సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ వినయ్ కుమార్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ ఉప్పరి వెంకటేష్ సమక్షంలో గుమ్మడిదల మత్స్యకారుల సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ కత్తుల రమేష్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కుంటి మల్లేష్, కాశ బోయిన ఆంజనేయులు, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి తోపాటు ముదిరాజ్ సంఘం కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

మత్స్యకారుల సహకార సంఘం నూతన సంఘ అధ్యక్షుడిగా కుంటి పెంటయ్య, ఉపాధ్యక్షుడిగా జిన్నా శంకర్, కార్యదర్శిగా జిన్న కనకేష్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా ఉషన్న రాజు, కాశబోయిన రాజు, కుంటి భాస్కర్, కోర్పాతి గణేష్, చిరుమని శ్రీనివాస్, జిన్న వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

- గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్‌కు వినతి

**గుమ్మడిదల, మే 13( సిరి న్యూస్):**




సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను ప్రభుత్వం సంబంధిత శాఖలు వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బుధవారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నిర్మాణ ప్రాంతాల్లో సెంట్రింగ్ సామాగ్రి తరచూ దొంగతనాలకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దొంగిలించిన సామాగ్రిని కొనుగోలు చేసే పాత ఇనుము, పాత సామాన్ల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భవన నిర్మాణ పనుల సమయంలో ప్రమాదవశాత్తు కార్మికులు పైనుంచి కిందపడే ఘటనల్లో ఎటువంటి సమగ్ర విచారణ లేకుండానే సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై నేరుగా కేసులు నమోదు చేయడం సరికాదని తెలిపారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి అమావాస్య రోజున సెంట్రింగ్ పనులకు సెలవు ప్రకటించాలని, ఈ విషయంలో కార్మిక శాఖతో పాటు పోలీసు శాఖ కూడా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ ప్రాంతాల్లో జరుగుతున్న సామాగ్రి దొంగతనాల నివారణకు పోలీసు శాఖతో చర్చించి చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రమేష్, కిషన్, మురళి, సంజీవ్ రెడ్డి, నాయకులు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, రాజుతో పాటు మండల సెంట్రింగ్ యూనియన్ సభ్యులు వీరేశం, రాజు, కృష్ణ, పోచయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ బనానా.. కనిపిస్తే వదలకండి..!

భారతీయుల ఆహారాల్లో అరటి పండుకు చాలా ప్రత్యేక స్థానం ఉంది. ఉపవాసం చేస్తున్నా, కడుపులో సమస్యలు ఉన్నా అరటి పండును సజెస్ట్ చేస్తారు చాలా మంది. ఆఖరికి భోజనం వడ్డించడానికి కూడా అరటి ఆకులకు వినియోగిస్తారు. అరటి పండుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పేదవాడి యాపిల్ గా పేరున్న ఈ పండు ఎంతో చవకగా మార్కెట్లో దొరుకుతుంది. అరటి పండ్లు ఎన్నో రకాలు ఉన్నప్పటికీ ఎరుపు రంగులో ఉండే పండ్లకు విశేష గుణాలున్నాయి. వీటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో మీరూ తెలుసుకోండి.

### ఈ పండు పోషకాల్లో మెండు..

ఎరుపు రంగులో ఉండే ఈ పండు వంధ్యత్వ సమస్యల నుంచి గుండె సమస్యల వరకు ప్రతిదానికీ పరిష్కారాలను అందిస్తుంది. ఈ పండులో మెదడు పనితీరు, గుండె పనితీరు, కాలేయ పనితీరు, ఎముకల బలం మరియు ప్రేగు కదలికలతో సహా అన్ని శారీరక విధులకు అవసరమైన పోషకాలు ఉంటాయి.





### మగవారికి వెరీ స్పెషల్..


కొంతమంది పురుషులు నాడీ విచ్ఛిన్నం కారణంగా మొత్తం శారీరక బలం తగ్గుతారు, ఇది అంగస్తంభన ప్రమాదాన్ని పెంచుతుంది. నాడీ సంబంధిత సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 48 రోజుల పాటు దీన్ని తింటే, వారి నరాలు బలపడతాయి, వారి పురుషత్వం మెరుగుపడుతుంది. ఈ పండును బిడ్డకు జన్మనిచ్చే పండు అని కూడా అంటారు. మీరు 40 రోజులు ఉపవాసం ఉండి, రాత్రిపూట పండ్లు తిని, ఆ తర్వాత 1 చెంచా తేనె కలిపితే, మీరు గర్భవతి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు.

### రక్తం పెరుగుతుంది..

రక్తహీనత ఉన్నవారు రోజూ 1 లేదా 2 పండ్లు తింటే, అది రక్త పరిమాణాన్ని పెంచడంలో, కొత్త రక్తాన్ని ఉత్పత్తి చేయడంలో బాగా సహాయపడుతుంది. గుండెల్లో మంట ఉన్నవారు అరటిపండ్లను దాదాపు 1 నెల పాటు నిరంతరం తింటే ఆ సమస్య నుండి బయటపడవచ్చు. అరటి పండులో అనేక ప్రయోజనాలు, ఔషధ గుణాలు ఉన్నాయి, ఇవి అనేక వ్యాధులను నయం చేస్తాయి.

### కిడ్నీల్లో రాళ్లు కరుగుతాయి..

ఇందులోని పొటాషియం మూత్రపిండాల్లో రాళ్లను నివారించడంలో ఎంతో సహాయపడుతుంది. ఇది రక్త పరిమాణం, హిమోగ్లోబిన్‌ను పెంచడానికి అవసరమైన అయాన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది.



# డ్రైఫ్రూట్స్‌తో మెరిసే ముఖం మీ సొంతం

చర్మ సౌందర్యం ప్రతి ఒక్కరి ఆశ. సీజన్ ఏదైనా చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడానికి సౌందర్య ప్రియులు అన్ని ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ ప్రతి ఒక్కరికి ఖరీదైన క్రీములు కొనడానికి తగినంత డబ్బు ఉండదు. కెమికల్స్‌తో కూడిన ఇలాంటి క్రీములను వాడేందుకు కొందరు ఇష్టపడరు. మీరు వారిలో ఒకరైతే ఇక్కడ ఒక సూపర్ ఐడియా ఉంది. చర్మ సంరక్షణకు క్రీములు ఎక్కువగా వాడకూడదు. వీటితో భవిష్యత్తులో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. సహజంగానే చర్మాన్ని మెరిసేలా చేసుకోవాలి. మీరు ముఖాన్ని అందంగా మార్చుకోవడానికి కొత్త ప్రయత్నాలు చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొన్ని డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యంతో పాటు ముఖ సౌందర్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. మీ ముఖం మెరిసిపోవడానికి మీరు ప్రతిరోజూ తీసుకోవాల్సిన డ్రైఫ్రూట్స్ ఇవే..





### అంజీర్

ఈ పండ్లలో విటమిన్ ఎ కూడా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమగా, మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. అంజీర్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి ముఖంలోని మొటిమలను తొలగించడంలో సహాయపడతాయి. రోజూ ఈ డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా చర్మం మెరుస్తుంది.

### వాల్ నట్స్

వాల్ నట్స్ లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇందులోని విటమిన్ బి చర్మంపై ముడతలను తగ్గిస్తుంది. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది.

### బాదం

బాదంలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. ఇది మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మాన్ని తేమగా ఉంచుతుంది. చర్మం ఎల్లప్పుడూ మెరుస్తూ ఉంటుంది.

### ఖర్జూరం

ఇది కూడా రోజూ తినవచ్చు. ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఖర్జూరం తింటే ముఖంపై మొటిమలు తగ్గుతాయి. ఎండుద్రాక్షలోని ఐరన్ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది చర్మం గ్లో పెంచుతుంది. మురికిని తొలగించడంలో సహాయపడుతుంది.

### జీడిపప్పు

జీడిపప్పులో విటమిన్ ఇ, సెలీనియం మొదలైనవి పుష్కలంగా ఉంటాయి. ఇది మొటిమలకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది ముఖంపై మొటిమల మచ్చలను కూడా సులభంగా తొలగిస్తుంది.

డ్రైఫ్రూట్స్ మీ మొత్తం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వలన మీకు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొలగిపోతాయి. ఆరోగ్యంగా ఉండవచ్చు. అయితే పైన చెప్పినవాటిలో కొన్నింటిని నానబెట్టి తింటే ఫలితాలు ఎక్కువగా ఉంటాయి. అయితే డ్రైఫ్రూట్స్ ఎక్కువగా కూడా తీసుకోకూడదు. మితంగానే తినాలి. అప్పుడే ప్రయోజనాలు మీకు దక్కుతాయి. చర్మాన్ని కూడా మెరిసేలా చేస్తాయి.



# ఈ అలవాట్లు మీ పిల్లల్ని స్మార్ట్‌గా మారుస్తాయి


తమ పిల్లలు అన్నింటిలో ముందుంటూ స్మార్ట్‌గా ఉండాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. చదువుతో పాటు కెరీర్‌లో కూడా తమ పిల్లలు దూసుకుపోవాలనుకుంటున్నారు. అయితే ఇందుకు చిన్నప్పటి నుంచే సోపానాలు వేయాలని నిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా తమ పిల్లలు తెలివైన వారిగా మారాలంటే తల్లిదండ్రులు తెగ కష్టపడాల్సిన అవసరం లేదని, తమ పిల్లలకు కొన్ని విషయాలు అలవాట్లుగా మారిస్తే సరిపోతుందని అంటున్నారు నిపుణులు. ముందుగా పిల్లలను మేధావులుగా పెంచాలి. ఏ విధమైన కార్యకలాపాలు పిల్లలను ప్రతిభావంతులుగా మారుస్తాయో తెలుసుకోవాలి అప్పుడే వారు సక్సెస్ అవుతారు. ఆ తర్వాతే వారిని ప్రోత్సహించండి. అటువంటి విషయాలను మీరు తెలుసుకోవాలి. అప్పడే పిల్లలు జీవితంలో విజయవంతమైన వ్యక్తులుగా ఉంటారు. పిల్లల్ని స్మార్ట్‌గా మార్చాలంటే వారికి కొన్ని అలవాట్లు అలవర్చాల్సి ఉంటుంది. అవేంటంటే..

### ధ్యానం

తగినంత మనశ్శాంతిని ఇవ్వడం, ధ్యానం సాధన చేయడం వల్ల రోజంతా చురుకుగా ఉండేందుకు శక్తి లభిస్తుంది. రోజూ 15 నిమిషాలు ధ్యానం చేస్తే జీవితంలో ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే ధైర్యం ఉంటుంది. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస. ఇలా చేస్తే పిల్లలకు ఏకాగ్రత అనేది బాగా పెరుగుతుంది. ఒక లక్ష్యంపై ఫోకస్ చేస్తారు.

### సంగీతం

సంగీతం గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. సంగీత పరికరాలను వాయించడం నేర్చుకోవాలి. ఇది మీ పిల్లల దృష్టిని మెరుగుపరుస్తుంది. వినూత్న ఆలోచనను కూడా ప్రోత్సహిస్తుంది.



క్రియేటివిటీ పెరుగుతుంది.

### గార్డెనింగ్:

గార్డెనింగ్ అనేది శరీరం, మనస్సును చురుకుగా ఉంచడం చేస్తుంది. మీ పిల్లలు మొక్కలు ఎలా పెరుగుతాయో, వాటికి ఏమి అవసరమో గమనించడం ప్రారంభించాలి. కొత్త ఆలోచనలు అభివృద్ధి చెందుతాయి. ప్రకృతిపై ప్రేమ పెరుగుతుంది. ఇది మనసును ప్రశాంతంగా ఉంచేలా చేస్తుంది.

### రాయడం

ప్రతిరోజూ ఒక పేజీలో ఏదైనా రాయమని పిల్లలను అడగండి. పిల్లలు రాసిన వాటిని ఇతరులకు చెప్పి సంతోషపెట్టండి. వారిని వ్యాసాలు రాసేలా ప్రోత్సహించండి. ఎందుకంటే ఇలా చేస్తే సృజనాత్మకత పెరుగుతుంది.

### చర్చలు

వ్యక్తులతో సహజంగా మాట్లాడటం, వారితో విషయాలు చర్చించడం వంటి కార్యక్రమాలలో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించండి. ఇది వారి కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. నలుగురిలో మాట్లాడే ధైర్యం వస్తుంది. ఏ విషయంలోనూ భయపడకుండా ఉంటారు. అన్ని విషయాలూ మీకు ధైర్యంగా చెబుతారు.

### ఉదయాన్నే నిద్ర లేవడం

పొద్దున్నే లేవడం కంటే మంచి అలవాటు లేదు. మీరు ఎంత ధ్యానం చేస్తున్నారో లేదా ఎంత వ్యాయామం చేస్తారో దాని కంటే ఉదయాన్నే నిద్రలేవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదయాన్నే లేచేవారి మైండ్ చురుకుగా ఉంటుంది. వారు అన్ని విషయాల్లో ముందు ఉంటారు. ప్రతీ విషయాన్ని చురుకుగా వింటారు.

### పుస్తక పఠనం

మీ బిడ్డను పుస్తకాలు చదివేలా చేయండి. మీరు ప్రతిరోజూ ఒక పేజీ చదివినా, మీ మెదడు శక్తి మెరుగుపడుతుంది. పుస్తకాలు చదివితే చాలా నాలెడ్జ్ వస్తుంది. ఏ సబ్జెక్ట్ పైన అయినా వారు అవగాహన కలిగి ఉంటారు.



# ఈ రోజుల్లో సాధారణ పాత్రలతో కష్టమే



'మిమి' చిత్రానికి జాతీయ పురస్కారంతో ప్రేక్షకుల్లో నాపై ఉన్న కొన్ని అభిప్రాయాలను బద్దలు కొట్టానని అంటోంది బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి తన కెరీర్‌ని మలుపు తిప్పిన ఆసక్తికర సంఘటన గురించి పంచుకుంది. ''నా సినీ ప్రస్థానంలో అన్నింటికన్నా గొప్ప విజయం 'మిమి' చిత్రానికి లభించింది. ఈ సినిమాకి నాకు జాతీయ పురస్కారం రావడం కెరీర్‌లోనే అత్యున్నత ఘట్టాలలో ఒకటి. భుజాలపై మోసిన నా మొదటి ప్రాజెక్ట్ అది. కెరీర్‌లో ఇంకా ముందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రేక్షకులు కూడా అదే కోరుకుంటున్నారని భావిస్తున్నా. గత రెండేళ్లు నాకు అద్భుతంగా గడిచాయి. 'తేరీ బాతోం మే ఐసా ఉల్జా జియా', 'క్రూ', 'దో పత్తి', 'తేరే ఇష్క్ మే' లాంటి నేను నటించిన చిత్రాలన్నీ విభిన్న పాత్రలు, నేపథ్యాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఇలా వరుస చిత్రాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం ఎంతో ముఖ్యం. ఈరోజుల్లో సాధారణ పాత్రలు చేస్తే సరిపోద''ని చెప్పుకొచ్చింది. 2021లో కరోనా కారణంగా ఓటీటీలో విడుదలైంది 'మిమి' చిత్రం. ఇందులో సరోగసి ద్వారా గర్భం దాల్చిన మిమి పాత్రలో భావోద్వేగ నటనతో వీక్షకుల్ని కట్టిపడేసింది కృతి. ఆమె తదుపరి 'కాక్‌టెయిల్ 2' సినిమాలో షాహిద్ కపూర్, రష్మికలతో కలిసి నటిస్తుంది.

# కంటెంట్ లెస్ సినిమాలు తీసి ఆడియన్స్ జేబులకు చిల్లులు పెడుతున్నారు..



టాలీవుడ్ నటుడు రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా సినిమా టికెట్ ధరలు, ప్రస్తుతం సినిమాల నాణ్యతపై చేసిన పోస్టులు ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీశాయి. భారీ బడ్జెట్ సినిమాలు వస్తున్నాయంటే చాలు, టికెట్ రేట్లు పెంచేయడం మేకర్స్‌కు ఒక అలవాటుగా మారిందని ఆయన చాలా ఘాటుగా విమర్శించారు. ప్రేక్షకులు ఒక చిత్రం చూడాలంటే కేవలం టికెట్ డబ్బులే కాదు, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గుర్తు చేశారు. భయంకరమైన వేసవి ఎండలు, విపరీతమైన ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు, పెరిగిన పెట్రోల్ ధరలు.. వీటన్నింటినీ దాటుకుని థియేటర్‌కు వస్తున్నారని తెలిపారు. ఒకవేళ మీ సినిమా ప్రేక్షకుడి అలసటను మర్చిపోయేలా చేయలేకపోతే, వారిని ఇళ్ల నుంచి బయటకు రమ్మని అడిగే హక్కు మనకు లేదని ఆయన స్పష్టం చేశారు. కంటెంట్ లెస్ సినిమాలు తీసి ఆడియన్స్ జేబులకు చిల్లులు పెట్టే అధికారం ఎవరికీ లేదని చెప్పాడు. ఫోన్ స్క్రీన్‌పై చూసే దానికి, థియేటర్‌లో చూసే దానికి తేడా ఉండాలని రాహుల్ అన్నారు. ఫోన్లలో సులభంగా చూడగలిగే కంటెంట్‌ను థియేటర్లలో చూపిస్తూ భారీ టికెట్ ధరలను సమర్థించుకోవడం సాధ్యం కాదని ఫైర్ అయ్యారు. థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుడికి ఒక అద్భుతమైన అనుభూతిని ఇస్తేనే ఆ టికెట్ రేటుకు విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఖాళీగా ఉంటున్న సినిమా హాళ్లు మన పనితీరు ఎంత దిగజారిపోయిందో చెప్పే ఒక నిజాయితీ గల తీర్పు అని ఆయన చెప్పడం గమనార్హం. ప్రేక్షకులకు ఏం తెలియదు, ఏది చూపించినా చూస్తారు అనే అహంకారాన్ని మేకర్స్ వదిలేయాలని రాహుల్ హెచ్చరించారు. ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరికీ కెమెరా పరిజ్ఞానం, సినిమా మేకింగ్ మెళకువలు తెలుసని ఆయన గుర్తు చేశారు. ప్రేక్షకులను తక్కువ అంచనా వేసి, వారిని అవమానిస్తూ మళ్ళీ వారి నుంచి కృతజ్ఞతను ఆశించడం సరికాదని అన్నారు. మొత్తానికి, సినిమాలను ఏదో ఒక మాయా కళారూపంగా చూడటం మానేసి, ప్రేక్షకులకు ఇచ్చే కనీస గౌరవం గురించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని రాహుల్ రామకృష్ణ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.



# 'శంబాల' బృందం.. మరో హారర్ సినిమా

గతేడాది 'శంబాల' సినిమాతో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు హీరో ఆది సాయికుమార్. యుగంధర్ ముని తెరకెక్కించిన ఈ చిత్రాన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే నిర్మాతలతో దర్శకుడు యుగంధర్ సమర్పణలో ఆది కథానాయకుడిగా మరో సినిమా పట్టాలెక్కనుంది. దీనికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మేరకు ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో ఆది నెత్తురోడుతున్న ముఖంతో సీరియస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. "భయం, ఉత్కంఠ, అపరిమిత వినోదం, బలమైన భావోద్వేగాలతో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఓ అద్భుత కథను చూపించనున్నాం. వినూత్నమైన కథాంశంతో ముస్తాబు కానున్న ఈ హారర్ సినిమాతో ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించనున్నాం. దీనికి సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. అందుకే దీనికోసం శ్రీచరణ్ పాకాలను ఖరారు చేశాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం"

# భర్తతో విడిపోతున్నట్టు రూమర్లు.. స్పందించిన నటి మౌనీరాయ్

తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ (Mouni Roy) స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్-మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.



# విజయ్‌ను కేవలం నటుడిగా చూడకూడదు

చిత్ర పరిశ్రమకు చెందిన విజయ్ (Vijay) తమిళనాడు ముఖ్యమంత్రి కావడం ఓ నటుడిగా గర్వంగా ఉందన్నారు కమల్ హాసన్ (Kamal Haasan). అయితే ఇప్పుడు విజయ్‌ను కేవలం యాక్టర్‌గా చూడవద్దన్నారు. ఆయనకు వేరే పెద్ద బాధ్యతలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (TASMAC) ఆధ్వర్యంలో.. ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, కళాశాలల సమీపంలో నడుస్తున్న 717 మద్యం దుకాణాలను మూసివేయాలన్న నిర్ణయం ప్రశంసనీయం అని అన్నారు. విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కమల్‌హాసన్ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. మద్యం దుకాణాలను తొలగించాలన్న విజయ్ నిర్ణయంపైనా ఆయన తక్షణమే స్పందించారు. ఈ చర్యను నిరంతరాయంగా కొనసాగించాలన్నారు.








# ప్రేమని ఓ లావాదేవీలా చూడొద్దు

''బంధాలనేవి మన ఎదుగుదలకు తోడ్పడేవిగా ఉండాలి గానీ, మనల్ని బంధించేవిగా ఉండకూడదు'' అంటోంది నటి తమన్నా. పరస్పర గౌరవం ఉన్న చోటే నిజమైన ప్రేమ వెల్లివిరుస్తుందని చెబుతోంది. ''ప్రతిఫలం ఆశించకుండా ప్రేమించడమే నిజమైన ప్రేమ. అదే స్వచ్ఛమైనది. ఏ ప్రేమైనా సరే ఎలాంటి షరతుల్లేనిదై ఉండాలి. దాన్నెప్పుడూ ఓ లావాదేవీలా చూడొద్దు. మనం అవతలి వాళ్లకు ఏదో ఇస్తున్నాం కనుక వాళ్ల నుంచి తిరిగి ఏదో ఆశించడం ఎప్పుడూ ప్రేమ అనిపించుకోదు'' అని ప్రేమ పట్ల తన ఆలోచనల్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది తమన్నా. ఆమె ప్రస్తుతం హిందీలో 'వివన్ - ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్', 'రాగిణి 3', 'వి శాంతారామ్' తదితర చిత్రాల్లో నటిస్తోంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.